# తెలంగాణలో వర్గీకరణ బిల్లు చెల్లదు

**మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్**



ఖైరతాబాద్, మార్చి 21: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లు చెల్లదని మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వర్గీకరణ అంటే దళితుల్లో ఉన్న ఆర్థిక, సామాజిక పరిస్థితుల ఆధారంగా జరగాల్సి ఉన్నట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కారంచేడు ఘటన జరిగినప్పుడు మాలమాదిగలంతా కలిసి పోరాడినట్టు గుర్తుచేశారు. అయితే, ఆరెండు వర్గాలు కలిసి ఉంటే తమ మనుగడ సాధ్యం కాదని భావించి వారిని విడగొట్టాలన్న ఆలోచనతో అప్పటి ప్రభుత్వం జస్టిస్ రామచంద్ర రాజు కమిటీ వేసి దొంగలెక్కలు చూపి వర్గీకరణ చేసినట్టు తెలిపారు. మాదిగలతో లబ్ధిపొందాలని బీజేపీ, ఏపీలో ఓటు బ్యాంక్‌గా వాడుకోవాలని టీడీపీ గతంలోనే కుట్రపన్నినట్టు ఆరోపించారు. ప్రస్తుత వర్గీకరణ సైతం ఎన్నికల ముందు తీసుకున్న నిర్ణయమేనని తెలిపారు. 341 ఆర్టికల్‌ను సవరించి వర్గీకరణ అమలు చేయాల్సి ఉంటుందని, అందుకు పార్లమెంట్‌లో మెజార్టీ సభ్యుల ఆమోదం పొందాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. సుప్రీం తీర్పు ప్రకారం క్రీమీలేయర్‌ను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, తెలంగాణలో ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లులో ఆ అంశాన్ని తీసుకోలేదని, మని వర్గీకరణ ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. ఇందులోనూ మతలబు ఉందని, మళ్లీ కోర్టులు వర్గీకరణ కేసును కొట్టివేయాలన్నది వారి ఉద్దేశమన్నారు. వర్గీకరణ విషయంలో మరోసారి కోర్టుకు వెళ్తామని తెలిపారు. తెలంగాణలో హామీ ఇచ్చిన 6 పథకాల్లో ఏ ఒక్కటీ అమలు కాకపోగా, ఏపీలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆరోపించారు.

# బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపండి

- **ఆదివాసీలకు జీవించే హక్కును కల్పించండి**
- **పౌర హక్కుల సంఘం నేతల డిమాండ్**

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే ఆపాలని రాష్ట్ర పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. బీజాపూర్, కాంకేర్ అడవుల్లో 30 మందిని ఎన్‌కౌంటర్ చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్‌కౌంటర్ పథకం ప్రకారమే జరిగిందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఆవేదన వ్యక్తంచేశారు. జనవరి 1, 2024 నుంచి 'ఆపరేషన్ కగార్' లో భాగంగా సుమారు 487 మందిని బూటకపు ఎన్‌కౌంటర్లతో హతమార్చారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఖండించారు. ఎన్‌కౌంటర్లు ఆపాలని 50 ఏండ్లుగా పౌర హక్కుల సంఘాలు పోరాడుతున్నట్టు తెలిపారు.

# 28 రోజులైనా లభ్యంకాని మృతదేహాల ఆచూకీ

అచ్చంపేట, మార్చి 21 : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో ఏడుగురి మృతదేహాల ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. 28 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. కలెక్టర్ సంతోష్ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నారు. ప్రధానంగా టన్నెల్ చిక్కుకుపోయిన బోరింగ్ మెషిన్‌లోని కీలక భాగాలను కత్తిరించి తొలగించడం.. సొరంగంలోకి చేరిన నీటిని బయటకు తరలిస్తున్నారు.

# నేడు సచివాలయంలో 'ఎర్త్ అవర్'

## గంటపాటు లైట్లు ఆఫ్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే ఎర్త్ అవర్‌కు నేడు(శనివారం) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గంటపాటు లైట్లు ఆఫ్ చేయనున్నారు. సీఎస్ శాంతికుమారి శుక్రవా రం ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రి 8.30 గంటల నుంచి 9.30వరకు సచివాలయంలో లైట్లన్నీ ఆఫ్ చేస్తామని, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.




















